తెలంగాణలో నేవీ రాడార్ స్టేషన్

- దామగూడెంలో 1174 హెక్టార్ల అటవీ భూముల బదిలీ
- సిఎం రేవంత్‌రెడ్డితో తూర్పు నావికా దళం అధికారుల భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత నావికా దళం తెలంగాణను కీలక స్థావరంగా ఎంచుకుంది. దేశంలోనే రెండో విఎల్‌ఎఫ్ కమ్యూనికేషన్ స్టేషన్‌ను వికారాబాద్ జిల్లాలో నెలకొల్పుతోంది. నౌకలు, జలాంతర్గాములతో సంభాషించేందుకు నావికా దళం విఎల్‌ఎఫ్ (వెరీలో ఫ్రీక్వెన్సీ) కమ్యూనికేషన్ ట్రాన్స్ మిషన్ స్టేషన్‌ను ఉపయోగిస్తోంది. వికారాబాద్ మండలం పూడూరు సమీపంలోని దామగూడెం అటవీ ప్రాంతంలో ఈ స్టేషన్ ఏర్పాటు చేయనుంది. దేశంలోనే ఇది రెండో స్టేషన్. తమిళనాడులోని తిరునెల్వేలిలో ఉన్న ఐఎన్‌ఎస్ కట్టబొమ్మన్ రాడార్ స్టేషన్ మొట్ట మొదటిది. 1990 నుంచి అది నావికా దళానికి సేవలందిస్తోంది. రెండో రాడార్ స్టేషన్ ఏర్పాటుకు తెలంగాణ అనువైన ప్రాంతంగా విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండ్ ఇప్పటికే గుర్తించింది. 2010 నుంచి నావికా దళం రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. పర్యావరణ అనుమతులు వచ్చినప్పటికీ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా భూముల కేటాయింపు ముందుకు సాగలేదు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులన్నీ తొలిగిపోయాయి. కమోడోర్ కార్తీక్ శంకర్, సర్కిల్ డిఇఒ రోహిత్ భూపతి, కెప్టెన్ సందీప్ దాస్ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. వికారాబాద్ డిఎఫ్ఒ, నావల్ కమాండ్ ఏజెన్సీ అధికారులు అటవీ భూముల బదిలీ ఒప్పందంపై సంతకాలు చేశారు. దామగూడెం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న 1174 హెక్టార్ల అటవీ భూమిని నేవీకి అప్పగించారు. 2014లోనే కేంద్ర అటవీ పర్యావరణ శాఖ నేవీ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. అటవీ భూమి అప్పగించేందుకు రూ.133.54 కోట్ల కాంపా నిధులు, భూసంరక్షణ చర్యలకు చేపట్టే పనులకు రూ.18.56 కోట్లను నేవీ చెల్లించింది. ఈ ప్రాజెక్టును రద్దు చేయాలని కోరుతూ దామగూడెం ఫారెస్ట్ ప్రొటెక్షన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వం నిర్ణయించిన షరతులకు అనుగుణంగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రతిపాదించిన అటవీ ప్రాంతంలో ఒక ఆలయం ఉంది. దీనికి ఇబ్బంది తలెత్తకుండా చూడడం, ఇతరులను అనుమతించేందుకు నేవీ అంగీకరించింది. ఇక్కడ నేవీ స్టేషన్‌తోపాటు ఏర్పడే టౌన్‌షిప్‌లో స్కూళ్లు, హాస్పిటళ్లు, బ్యాంకులు, మార్కెట్లు ఉంటాయి. ఈ నేవీ యూనిట్‌లో దాదాపు 600 మంది నావికాదళంతోపాటు ఇతర సాధారణ పౌరులు ఉంటారు. దాదాపు 2500 నుంచి 3000 మంది ఈ టౌన్‌షిప్‌లో నివసిస్తారు. విస్తృతంగా మొక్కలు నాటి పెంచడం ద్వారా ఈ ప్రాంతంలో జీవవైవిధ్యం, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు తగిన చర్యలు చేపడుతారు. ఈ ప్రాజెక్టులో భాగంగానే దామగుండం రిజర్వ్ ఫారెస్ట్ చుట్టూ దాదాపు 27 కి.మీ రోడ్డు నిర్మిస్తారు. 2027లో ఈ కొత్త విఎల్‌ఎఫ్ సెంటర్ పూర్తవనుంది.



విద్యావలంటీర్లను రెన్యువల్ చేస్తాం

- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


విద్యా వలంటీర్లను వచ్చే విద్యా సంవత్సరంలో రెన్యూవల్ చేస్తామని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మెగా డిఎస్‌సి కోసం సత్వరమే చర్యలు తీసుకోవాలనీ, ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకూ విద్యా వలంటీర్లను రెన్యువల్ చేయాలంటూ టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి రియాజ్, పిసిసి మీడియా కో-ఆర్డినేటర్ కమలాకర్, టివిపిఎస్ వ్యవస్థాపకులు, డిఎస్‌సి అభ్యర్థుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మఠం శివానంద స్వామి బుధవారం హైదరాబాద్‌లో బుర్రా వెంకటేశాన్ని కలిసి విజ్ఞప్తి చేశారు. సార్వత్రిక ఎన్నికల్లోపు డిఎస్‌సి నోటిఫికేషన్‌ను జారీ చేయాలని కోరారు. పర్సెంటేజ్ నిబంధనతో చాలామంది అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, ఆ సమస్య లేకుండా నోటిఫికేషన్ ఇవ్వాలని సూచించారు. వీలైనన్ని అధిక సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం చర్యలు తీసుకుంటున్నామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. త్వరలోనే అనుబంధ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామన్నారని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రితో బ్రిటిష్ హై కమిషనర్ భేటీ

- లండన్ పర్యటనపై ముచ్చటించిన సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లండన్‌లోని థేమ్స్ రివర్ ప్రాజెక్టు తరహాలో హైదరాబాద్‌లో మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్రిటిష్ హై కమిషనర్ అలెక్స్ ఎల్లిస్‌తో తన ఆలోచనలను పంచుకున్నారు. ఇటీవల లండన్ పర్యటనలో అక్కడ థేమ్స్ నది నిర్వహిస్తున్న తీరు, రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అభివృద్ధి చేసిన తీరును ప్రత్యేకంగా అధ్యయనం చేసినట్లు చెప్పారు. అదే మోడల్‌లో హైదరాబాద్‌లో మూసీనది పునరుజ్జీవింపజేసేందుకు చేస్తున్న ప్రణాళికలను, ప్రాజెక్టుకు సంబంధించిన అవుట్ లైన్, థేమ్స్ నది తరహాలో అభివృద్ధి, తదితర అంశాలను ఆయనతో చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సచివాలయంలో బ్రిటిష్ హై కమీషనర్ అలెక్స్ ఎల్లిస్‌తో భేటీ అయ్యారు. మూసీనది అభివృద్ధిలో పర్యావరణాన్ని కాపాడుతూ, సహజ వనరులకు విఘాతం లేకుండా అభివృద్ధి చేస్తామని సిఎం అన్నారు. సిఎం దార్శనికతకు, నది పరీవాహిక ప్రాంత అభివృద్ధి చేపట్టటం పట్ల బ్రిటిష్ హై కమీషనర్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్, ఎకో టూరిజం కు తమ సహకారం ఉంటుందని ఎల్లిస్ అన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, డిప్యూటీ హై కమిషనర్ గారేత్ వైన్ ఒవేన్ తదితరులు పాల్గొన్నారు.



మార్చిలో క్రెడాయ్ ప్రాపర్టీ షో

- వచ్చే రెండేళ్లలో 1.3 లక్షల నివాసాలు
- క్రెడాయ్ ప్రతినిధుల వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

వచ్చే నెలల్లో పెద్ద ఎత్తున ప్రాపర్టీ షోను నిర్వహించడానికి క్రెడాయ్ నిర్ణయించింది. మార్చి 8 నుంచి 10వ తేది వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో 2024ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థ ప్రెసిడెంట్ ఎలెక్ట్ వి రాజశేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ బి జగన్నాథ రావు, ప్రాపర్టీ షో కన్వీనర్ కొత్తపల్లి రాంబాబు, ఇతర సీనియర్లతో కలిసి మాట్లాడారు. "గచ్చిబౌలి, కొండాపూర్, నల్లగండ్ల, కోకాపేట్, పుప్పాలగూడ, నార్సింగి, తెల్లాపూర్, కొంపల్లి, శామీర్‌పేట్ వంటి కొన్ని సూక్ష్మ మార్కెట్లు గణనీయమైన వృద్ధిని సాధిస్తున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ దేశంలోని రియల్ ఎస్టేట్ పెట్టుబడులలో అత్యుత్తమ రిటర్న్‌లను అందిస్తోంది. ఇక్కడ ఇల్లు కొనుగోలు చేయడానికి ఇది ఉత్తమమైన మార్గం.నగరం అంతటా జరుగుతున్న అభివృద్ధి, పరిశ్రమల అభివద్ధి, హౌసింగ్ , కమర్షియల్ రియల్ ఎస్టేట్ కోసం డిమాండ్ దృష్ట్యా అత్యంత విశ్వసనీయమైన రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లపై దృష్టి సారించి ప్రాపర్టీ షోను రూపొందించాము." అని వారు తెలిపారు. వచ్చే రెండు, మూడేళ్లలో నగరంలో కొత్తగా 1.30 లక్షల కొత్త నివాసాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. సమావేశంలో క్రెడాయ్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు బి. ప్రదీప్ రెడ్డి, సిజి.మురళీ మోహన్, ఎం శ్రీకాంత్, కోశాధికారి మనోజ్ కుమార్ అగర్వాల్, జాయింట్ సెక్రటరీలు జి.నితీష్ రెడ్డి పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

బిఆర్ఎస్, కాంగ్రెస్ దొందూ దొందే..

- గుడిసెవాసులపై అక్రమ కేసులను ఎత్తేయాలి
- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి
- జైల్లో పేదలను కలిసిన ఐద్వా బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదేళ్లు తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన బిఆర్ఎస్, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. జగిత్యాల జిల్లాలో ఇండ్ల స్థలాల కోసం గుడిసెలు వేసుకున్న పేదలపై అక్రమ కేసులు పెట్టి, తొమ్మిది మందిని కరీంనగర్ జైల్లో రిమాండ్ చేయగా.. వారిని బుధవారం ఐద్వా ప్రతినిధులతో కలిసి మల్లు లక్ష్మి పరామర్శించారు. అనంతరం ముకుందలాల్ మిశ్రాభవన్‌లో విలేకరుల సమావేశంలో లక్ష్మి మాట్లాడుతూ స్వరాష్ట్రంలో అధికారం చేపట్టి పదేళ్ళు పాలించిన బిఆర్ఎస్ పేదలకు డబల్ బెడ్రూమ్ ఇళ్లు ఇస్తామని ఊరించి, ఉసూరుమనిపించిందని విమర్శించారు. బిఆర్ఎస్ తీరును వ్యతిరేకిస్తూ కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే.. ఇంటి స్థలం కోసం గుడిసెలు వేసుకున్న పేదలపై ఉక్కుపాదం మోపి, అక్రమ కేసులు పెట్టి, జైలులో పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేల కోట్ల ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నా పట్టించుకోని పాలకులు, కేవలం 60 గజాల్లో ఇంటి స్థలం కోసం గుడిసెలు వేసుకుంటే అమాయకులపై 307 లాంటి అక్రమ కేసులు పెట్టడం పోలీసుల పాశవిక తీరును స్పష్టం చేస్తోందన్నారు. రాష్ట్రంలోని 69 ప్రాంతాల్లో పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్నారని, వెంటనే ఇళ్ల పట్టాలు అందజేసి, ఇళ్ల నిర్మాణాల కోసం రూ.ఐదు లక్షల ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. పేదలపై బనాయించిన అక్రమ కేసులను వెంటనే ఎత్తేయాలని, అరెస్టు చేసిన తొమ్మిది మందిని సత్వరమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా సంఘాల మద్దతుతో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె ఆశాలత, కరీంనగర్, జగిత్యాల జిల్లాల కార్యదర్శులు కె నాగరాణి, పద్మ, నాయకులు ఉప్పులేటి లక్ష్మి ఉన్నారు.

కెసిఆర్ నాయకత్వంలోనే పనిచేస్తాం

- పార్టీ మారడంలేదు
- రేవంత్‌ను కలిసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాము పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన నలుగురు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఖండించారు. కెసిఆర్ నాయకత్వంలోనే పనిచేస్తామని చెప్పారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటికి ఆ ఎమ్మెల్యేలు వెళ్లిన సంగతి తెలిసిందే. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి (నర్సాపూర్), కొత్త ప్రభాకర్‌రెడ్డి (దుబ్బాక), కె మాణిక్‌రావు (జహీరాబాద్) సిఎంను కలిశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఒకేసారి సిఎంతో భేటీ కావడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. "మేం ఎవరితోనూ చర్చలు జరపలేదు. మెదక్ జిల్లా సమస్యలు వివరించేందుకే సిఎంను కలిశాం. దీనిపై కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారు.. ఇది సరికాదు. మా ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే పరువునష్టం దావా వేయాల్సి ఉంటుంది. పార్టీపై గౌరవం ఉంది. కెసిఆర్ నాయకత్వంలోనే పనిచేస్తాం. నియోజకవర్గాల సమస్యలు, అభివద్ధి గురించి సిఎంకు చెప్పడం మా హక్కు. మెదక్ జిల్లాకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరాం" అని సునీతా లక్ష్మారెడ్డి తెలిపారు."సిఎం కలిసి మెదక్ జిల్లా సమస్యల గురించి చెప్పాం. మొన్న మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరా. తెలంగాణ ఉద్యమం ఆరంభం నుంచి బిఆర్ఎస్‌లోనే ఉన్నాం. అలాంటిది కాంగ్రెస్‌లో మేం ఎందుకు చేరుతాం? మెదక్ జిల్లాలో ప్రొటోకాల్ పాటించడం లేదని ఫిర్యాదు చేశాం. సిఎం, మంత్రులు, అధికారులను కలవడం తప్పా? కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. వాటిని ఎప్పటినుంచి అమలు చేస్తారని అడుగుతున్నాం. రెండు వారాలైనా మల్లన్నసాగర్ నుంచి నీళ్లు వదలడం లేదు. వచ్చే ఎన్నికల్లో మెదక్ పార్లమెంటులో ఎగిరేది గులాబీ జెండానే" అని కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు.

హెచ్‌ఎండిఎ మాజీ అధికారి ఇంట్లో ఎసిబి సోదాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హెచ్‌ఎండిఎ పట్టణ ప్రణాళిక మాజీ అధికారి శివబాలకృష్ణ, ఆయన బంధువుల ఇళ్లు, కార్యాలయాల్లో ఎసిబి అధికారులు సోదాలు చేస్తున్నారు. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారలనే ఆరోపణలపై ఏకకాలంలో ఎనిమిది బృందాలుగా ఈ సోదాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అమీర్‌పేటలోని హెచ్‌ఎండిఎ కార్యాలయంలోనూ తనిఖీలు జరుగుతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోలో శివబాలకృష్ణ పనిచేస్తున్నారు.

పలువురు ఐఎఎస్‌లు బదిలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న పలువురు ఐఎఎస్ అధికారులకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఎస్‌సి అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా ఎన్. శ్రీధర్‌ను, పశుసంవర్ధక శాఖ సంయుక్త కార్యదర్శిగా డి.అమోయ్ కుమార్‌ను, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శిగా టి. వినయ్ కృష్ణారెడ్డి, ఎస్ హరీష్‌ను ఆర్అండ్‌బి శాఖ సంయుక్త కార్యదర్శిగా, పి కాత్యాయినీ దేవిని తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ సిఇఒగా, నాన్ కేడర్ ఐఎఎస్ సుశీల్‌కుమార్‌ను గనులశాఖ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మెహదీపట్నంలో స్కై వాక్

- రక్షణ శాఖ భూములు అప్పగించిన కేంద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సిటీలో మెహదీపట్నంలో స్కై వాక్ నిర్మాణానికి లైన్ క్లియర్ అయింది. త్వరలోనే స్కై వే నిర్మించనున్నట్లు హెచ్‌ఎండిఎ ప్రకటించింది. పెరిగిన ట్రాఫిక్ రద్దీ కారణంగా రోడ్లపై నడిచి వెళ్లే వారి భద్రత దృష్ట్యా ఇక్కడ స్కై వే నిర్మించాలనే ప్రతిపాదనలు ఎప్పటినుంచే ఉన్నాయి. రైతు బజార్ ప్రాంతంలో ఉన్న తమ భూములను ఇచ్చేందుకు కేంద్ర రక్షణ శాఖ అంగీకరించకపోవటంతో పీటముడి పడింది. రక్షణ శాఖ పరిధిలోని 0.51 ఎకరాల స్థలం తమకు బదిలీ చేయాలని గత ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కేంద్ర ప్రభుత్వం స్పందించక పోవటంతో స్కై వాక్ పనులు నిలిచిపోయాయి. రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే సిటీలో ట్రాఫిక్ రద్దీని అధిగమించే చర్యలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. జనవరి 5వ తేదీన ఢిల్లీకి వెళ్లినప్పుడు ప్రత్యేకంగా రక్షణ శాఖ మంత్రిని కలిశారు. అక్కడున్న రక్షణ శాఖ భూములను తమకు బదిలీ చేయాల్సిన అవసరాన్ని వివరించడంతో మంత్రి సానుకూలంగా స్పందించారు. ఢిఫెన్స్ జోన్‌కు ఇబ్బంది లేకుండా కేంద్ర ప్రభుత్వం సూచించిన మార్పులకు అనుగుణంగా స్కై వే డిజైన్‌లో సిఎం పలు మార్పులు చేయించారు. కొత్త ప్రతిపాదనలను ఇటీవలే కేంద్రానికి పంపించారు. స్కై వే నిర్మాణానికి అవసరమైన మేరకు భూముల కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం బుధవారం ఆమోదం తెలిపింది. మొత్తం 3380 చదరపు గజాల స్థలాన్ని తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించనుంది. బదిలీ చేసిన భూములకు బదులుగా కేంద్రం ఢిపెన్స్ విభాగానికి రూ.15.15 కోట్ల విలువైన మౌలిక వసతులు కల్పించాల్సి ఉంటుంది. నాలుగు వారాల్లోనే ఈ భూములను అప్పగించేందుకు కేంద్ర రక్షణ శాఖ అంగీకరించింది. దీంతో మెహదీపట్నం స్కై వాక్ పనులకున్న ప్రధాన అడ్డంకి తొలిగిపోయింది.

ఫిబ్రవరిలో మెగా డిఎస్‌సి

- మార్చిలో గ్రూప్-2
- హాజీపూర్ బాలికల కుటుంబాలకు అండగా ఉంటాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వందరోజుల్లో అభయహస్తం గ్యారెంటీ పథకాలను అమలు చేస్తాం.. ఫిబ్రవరిలో మెగా డిఎస్‌సి వేస్తాం.. మార్చిలో గ్రూప్-2 పరీక్షలు నిర్వహిస్తామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం హాజీపూర్ గ్రామంలో రూ.6 కోట్ల 31 లక్షలతో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. మైలారం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానా నూతన భవనాన్ని ప్రారంభించి బెడ్ల ఏర్పాటు కోసం మంత్రి సొంత డబ్బులు రూ.50 వేలు జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హాజీపూర్ బ్రిడ్జిని ఆరు నెలల్లోపు పూర్తి చేస్తామని, హాజీపూర్ గ్రామంలో రూ.40 లక్షలతో సిసి రోడ్లు, డ్రెయినేజీ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. అఘాయిత్యాలకు బలైపోయిన బాలికల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. వారి కుటుంబాలకు ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి అర్హులైన వారికి అవుట్‌సోర్సింగ్ కింద ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఫిబ్రవరిలో మెగా డిఎస్‌సి, మార్చిలో గ్రూప్-2 నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. హాజీపూర్‌లో బ్రిడ్జి నిర్మాణంతో దూరాభారం తగ్గుతుందని, బ్రిడ్జికి నిధులు మంజూరు చేసిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఆలేరు మండలంలోని రూ.17 కోట్లతో కొలనుపాక బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేశారు.

ఆర్‌టిసి బస్సు ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి బస్సు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం ఎదుట గల ప్రధాన రహదారిపై బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అక్సాన్‌పల్లి గ్రామానికి చెందిన కొత్తగొల్ల మల్లేశం(24) తన ద్విచక్ర వాహనంపై రాంగ్ రూట్లో వస్తుండగా.. అదే సమయంలో సంగారెడ్డి వైపు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు ఆ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేశంకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని భార్య మౌనిక ఫిర్యాదు మేరకు జోగిపేట ఎస్ఐ అరుణ్ కుమార్ గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు..

సిఎం సెక్యూరిటీలో సమూల మార్పులు

- కార్ల రంగు మార్పు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సెక్యూరిటీలో సమూల మార్పులను చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర సిఎంగా డిసెంబర్ ఏడో తేదీన బాధ్యతలు స్వీకరించాక కొంత కాలం పాటు ఆయనకు పాత సెక్యూరిటీని రాష్ట్ర ఇంటలిజెన్స్ సెక్యూరిటీ విభాగం అధికారులు కొనసాగించారు. భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయనే అనుమానంతో ఆయన భద్రతా విభాగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో మొదటి అడుగుగా సిఎం ప్రధాన భద్రతా అధికారి (సిఎస్‌ఒ)గా నార్కోటిక్ సెల్ విభాగం ఎస్‌పి గుమ్మి చక్రవర్తిని నియమించిన సంగతి తెలిసిందే. తాజాగా ముఖ్యమంత్రిని అనుసరించే సెక్యూరిటీ సిబ్బందినీ బదిలీ చేసి వారి స్థానాల్లో కొత్తవారిని నియమించినట్టు సమాచారం. అంతేగాక, ఇంటలిజెన్స్ సెక్యూరిటీ విభాగంలో సీఎం సెక్యూరిటీని పర్యవేక్షించే మరికొందరు అధికారులనూ బదిలీ చేస్తున్నట్టు తెలిసింది. కార్లకు ఇది వరకు ఉన్న తెలుపు, సిల్వర్ రంగులను తీసేసి పూర్తిగా నలుపు రంగులోకి మార్చారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

- బౌన్సర్ మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అతివేగంగా వచ్చిన కారు ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బౌన్సర్ మృతిచెందారు. మరొకరికి గాయాలైన ఘటన హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. జూబ్లీహిల్స్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన లింగాల తారకరామ్ (30) హైటెక్ సిటీ నోవాటెల్ హెూటల్‌లో బౌన్సర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం తెల్లవారు జామున పని ముగించుకుని మరో వ్యక్తి రాజుతో కలిసి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ రోడ్ నెం.36 పెద్దమ్మతల్లి గుడి సమీపంలో బైక్‌ను ఓ కారు ఢీకొట్టింది. దాంతో తారకరామ్ అక్కడికక్కడే మృతిచెందాడు. రాజుకు గాయాలయ్యాయి. ఢీకొట్టిన కారును ఆపకుండా డ్రైవర్ వెళ్లిపోయారు. రాజును స్థానికులు జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తారకరామ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, సిసి ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

ఎంఎస్‌ఎంఇలకు చేయూత

- ఇండస్ట్రియల్ క్లస్టర్లను పెంచుతాం
- యువ పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం
- సంపద సృష్టించే రంగాల్లో అందరిని భాగస్వాములు చేస్తాం
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి



టూరిజం ప్లాజాలో ప్రదర్శనలో పరిశ్రమలలోని ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సూక్ష్మ, మధ్య, చిన్నతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఇ) ప్రోత్సాహానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్ ప్రైజెస్ డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ ఆధ్వర్యంలో బుధవారం టూరిజం ప్లాజాలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థలకు ఊత మిచ్చేలా ఉత్పత్తి రంగమైన వ్యవసాయం నుంచి మొదలుకొని పారిశ్రామిక రంగం వరకు గత ప్రభుత్వాలు పణాళికలు రచించాయని గుర్తు చేశారు. నాడు వేసిన బలమైన పునాదులపై నేడు దేశం అన్ని రంగాల్లో పురోగమిస్తోందని చెప్పారు. ఉత్పత్తి రంగం, పంచవర్ష ప్రణాళికలు, మిశ్రమ ఆర్థిక వ్యవస్థలే సువిశాలమైన భారతదేశ ఆర్థిక పురోగతిలో కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఆర్థిక సరళీకరణ, ప్రపంచీకరణ నేపథ్యంలో దేశంలోకి అడుగుపెట్టిన బహుళ జాతి సంస్థలు చిన్న తరహా పరిశ్రమలను మింగేశాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంపద మొత్తం ఒకేచోట పోగవ్వడం ప్రజాస్వామ్యానికి, సమాజానికి మంచిది కాదని తెలిపారు. ఉద్యోగ, ఉపాధి కల్పన, సమానత్వం, సామాజిక న్యాయం, వృద్ధిరేటు పెరగడానికి ఈ రంగంలో విరివిగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని చెప్పారు. మల్టీ నేషనల్ కంపెనీల వల్ల సామాజిక న్యాయం, సమానత్వం, ఉద్యోగ- ఉపాధి కల్పన భూతద్దం పెట్టి వెతికినా కనిపించవని చెప్పారు. ఈ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఇండస్ట్రియల్ క్లస్టర్లను పెంచడంతో పాటు, ప్రభుత్వ పరంగా పారిశ్రామికవేత్తలకు ఆర్థికంగా, మేధోపరంగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సంపద సృష్టించే రంగాల్లో అందరిని భాగస్వాములు చేయడంతోనే సమసమాజ స్థాపన జరుగుతుందని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి యువ పారిశ్రామిక వేత్తలకు, ఎంఎస్‌ఎంఇ పరిశ్రమలకు మరిన్ని రాయితీలు, అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆడిషనల్ డెవలప్ మెంట్ కమిషనర్ డి. చంద్రశేఖర్, ఎఫ్‌ఈటిఎస్‌ఐఏ అధ్యక్షులు ఎ భాస్కర్‌రెడ్డి, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేస్తున్న గుగ్గీల్ల గ్రామస్తులు

ఇథనాల్ పరిశ్రమ పనుల అడ్డగింత

- రాజీవ్ రహదారిపై గుగ్గీల్ల గ్రామస్తుల రాస్తారోకో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మండల పరిధిలోని గుగ్గీల్ల గ్రామ శివారులో జరుగుతున్న ఇథనాల్ పరిశ్రమ పనులను బుధవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. విద్యుత్ సరఫరా కోసం నిర్మించ తలపెట్టిన దిమ్మ నిర్మాణాలు అడ్డుకొని నిర్మాణ సామగ్రిని ట్రాక్టర్‌లో తరలించుకుపోయారు. అనంతరం ఇథనాల్ పరిశ్రమ నిర్మాణ అనుమతులను ప్రభుత్వం రద్దు చేయాలనే డిమాండ్‌తో బెజ్జంకి క్రాసింగ్ గ్రామ స్టేజ్ వద్ద రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులతో మాట్లాడి విరమింపజేశారు.

కళాకారులకు ఆదర్శప్రాయుడు సత్య దేవ్

ప్రజాశక్తి - కల్చరల్

నిరాడంబరంగా కనిపించే సత్యదేవ్ కీ బోర్డు కళాకారుడుగా అసమాన ప్రతిభకల వారని ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అన్నారు. అయన వ్యక్తిత్వం కళాకారులకు ఆదర్శ ప్రాయమనీ ప్రశంసించారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని లలిత కళా వేదికపై ప్రముఖ మహిళా సాంస్కృతిక సంస్థ రాగ రాగిణి నిర్వహణలో అంతా రామ మయం శీర్షికన ప్రముఖ గాయని రమణ కుమారి శాంతకుమారి లక్ష్మీ శాంతి దినకర్ కనకల గాన విభావరి రసరమ్యంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ కీ బోర్డు కళాకారుడు సత్యదేవ్‌ను సత్కరించి పార్వతీశం మాట్లాడుతూ తాము పాటలు పాడ గలిగి వుండి కూడా సహ గాయనులకు వేదిక కల్పిస్తున్న రాగ రాగిణి సంస్థ సోదరీమణులు అభినందనీయులు అన్నారు. రాముడు మనవమాత్రుడే కానీ అయన మానవ జాతికి ఆదర్శ పురుషుడు అని వివరించారు. ప్రముఖ గాయకుడు త్రినాథ రావు అధ్యక్షత వహించిన సభలో సంస్థ కార్యదర్శి సుబ్బు లక్ష్మి నివేదిక సమర్పించారు



సత్య దేవ్‌ను సత్కరిస్తున్న పార్వతీశం



క్రీడల అభివృద్ధికి చర్యలు

- క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం
- అర్జున అవార్డు గ్రహీతలతో సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో క్రీడల అభివృద్ధికి తమ ప్రభుత్వం తగినంత ప్రోత్సహం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అర్హతలకు అనుగుణంగా ఆర్థిక సాయం, ఉద్యోగావకాశాలు కల్పించి క్రీడాకారులను ప్రోత్సహిస్తామని చెప్పారు. రాష్ట్రానికి చెందిన అర్జున అవార్డు గ్రహీతలు, ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన విజేతలు బుధవారం సచివాలయంలో సిఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రతి క్రీడాకారుడిని పలకరించిన ముఖ్యమంత్రి.. వారి విజయాలు, భవిష్యత్తు టోర్నీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విజేతలందరినీ సీఎం శాలువాలతో సత్కరించి అభినందించారు. ప్రతి క్రీడాకారుడు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని, జాబితాను రూపొందించాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా విజేతలందరూ తమ పతకాలను, అవార్డులను సగర్వంగా ముఖ్యమంత్రికి చూపించారు. ముఖ్యమంత్రి అందించిన ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. సిఎంను కలిసిన వారిలో హుసాముద్దీన్ (కామన్వెల్త్ గేమ్స్ బాక్సింగ్ కాంస్య పతక విజేత), ఈషా సింగ్ (షూటింగ్,ఆసియా క్రీడలు 2023 బంగారు పతక విజేత), నిఖత్ జరీన్ (బాక్సింగ్‌లో కాంస్య పతకం), కినాన్ చెనై డారియస్ (షూటింగ్‌లో బంగారు పతక విజేత), అగసర నందిని (అథ్లెటిక్స్‌లో కాంస్య పతక విజేత), ఎన్. సిక్కి రెడ్డి (బ్యాడ్మింటన్) పి. గాయత్రి గోపీచంద్ (బ్యాడ్మింటన్), పారా అథ్లెట్, పారా గేమ్స్‌లో గోల్డ్ మెడలిస్ట్ అయిన జీవన్‌జీ దీప్తి ఉన్నారు.



మళ్లీ విధుల్లోకి తీసుకోండి

- సిఎంకు సస్పెండైన ఆర్‌టిసి ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చిన్నచిన్న కారణాలతో గత ప్రభుత్వంలో తమను ఉద్యోగంలోంచి తొలగించిందనీ, తమను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని గతంలో సస్పెండైన ఆర్‌టిసి ఉద్యోగులు సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో తమకు అన్యాయం జరిగిందని, తమ గోడును సిఎంకు విన్నవించుకునేందుకు పలువురు ఆర్‌టిసి ఉద్యోగులు బుధవారం జుబ్లిహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసానికి వచ్చారు. చిన్న చిన్న కారణాలతో గత ప్రభుత్వం సుమారు 1500 మందిని ఉద్యోగాల నుంచి తీసివేసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సిఎంను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు ముగ్గురికి పోలీసులు అనుమతి ఇవ్వగా వారు సిఎంను కలిసి తమ సమస్యను వివరించారు.



గురుకులంలో తనిఖీలు నిర్వస్తున్న ఎసిబి అధికారులు

ముధోల్ గురుకులంలో ఎసిబి తనిఖీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముధోల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బుధవారం ఎసిబి డిఎస్‌పి రమణమూర్తి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. గురుకుల పాఠశాల నిర్వహణ పట్ల ఆరోపణలు రావటంతో ఎసిబి అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. బోజనశాల, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. పాఠశాల సిబ్బందిని అడిగి పలు వివరాలు తెలుసు కున్నారు. ఆయన వెంట ఎసిబి సిఐ సునీల్ గౌడ్, జాన్‌రెడ్డి సిబ్బంది ఉన్నారు.

ప్రజలపక్షాన నిలదీస్తాం.. కొట్లాడుతాం

- కరీంనగర్ ఎంపి ఒక్క గుడియైనా, బడియైనా కట్టిండా..?
- కాంగ్రెస్‌పైనా, బిజెపి ఎంపీపైనా కెటిఆర్ ఘాటు వ్యాఖ్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



అసెంబ్లీ ఎన్నికల్లో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను వదిలేది లేదు.. హామీలను అమలు చేయకపోతే నడిరోడ్డుపై బట్టలిప్పి నిలబెడుతాం. రైతుబంధు అడిగిన రైతులనే చెప్పుతో కొడతామని బెదిరిస్తున్న వాళ్లను.. రైతుభరోసా ఇవ్వకపోతే ఏ చెప్పుతో కొడతారో.. లేక ఓటుతో కొడతారో ప్రజలే తేల్చుకోవాలి. ఎప్పుడూ హిందువుల గురించి మాట్లాడే కరీంనగర్ ఎంపి సంజయ్ ఒక్క గుడి, బడి అయినా కట్టిండా..? కనీసం ఐదు కొత్తలు కూడా తేలేదు' అంటూ కాంగ్రెస్‌పైనా, కరీంనగర్ ఎంపి సంజయ్‌పైనా బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని బిఆర్‌ఎస్ సోషల్ మీడియా వారియర్స్‌తో బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల పేరుతో హామీల అమలును వాయిదా వేయాలని కాంగ్రెస్ చూస్తోందని తెలిపారు. ఎంపీ ఎన్నికలకు ముందే ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో నూరు అబద్ధాలు చెప్పి మోడీ ప్రధాని అయ్యారని, ఇక్కడ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని విమర్శించారు.

200 కేజీల గంజాయి పట్టివేత, వ్యక్తి అరెస్టు

- జిల్లాలో ఇంత పెద్ద మొత్తంలో పట్టుబట్టడం ఇదే ప్రథమం
- అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ నాగేందర్ రావు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎసిపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్‌లో రూ.40 లక్షల విలువైన 200 కేజీల గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. తొర్రూరు ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బుధవారం ఎసిపి నాగేందర్‌రావు వివరాలు వెల్లడించారు. నెల్లికుదురు మండలంలోని లక్ష్మీపురం గ్రామం వద్ద మహబూబాబాద్ జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బి కృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని రంపచోడవరం నుంచి తొర్రూరు వైపు వెళుతున్న షిఫ్ట్ డిజైర్ కారు అధిక వేగంతో వెళ్లడంతో అనుమానం వచ్చిన పోలీసులు ఆ కారును వెంబడించారు. అతివేగంతో వెళ్తున్న కారు పల్టీ కొట్టింది. కారును చేజ్ చేసిన పోలీసులు వెంటనే కారును అదుపులోకి తీసుకొని తనిఖీలు చేయగా డిక్కీలో 200 కిలోల 100 ప్యాకెట్ల గంజాయిని గుర్తించారు. వెంటనే వాటిని స్వాధీనం చేసుకొని కారు నడుపుతున్న వ్యక్తికి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు.. ఎపిలోని నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం సిత్తాపురం గ్రామానికి చెందిన కుంచాల జయచంద్రుగా గుర్తించారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిపారు. నిందితుని ఫోన్ నెంబర్ల ఆధారంగా గంజాయి ఎక్కడికి రవాణా అవుతుంది..? ఎవరు ఆర్డర్ చేశారు..? దీని వెనుక ఎవరెవరి హస్తం ఉంది..? అన్న కోణంలో విచారణ జరుపుతున్నట్టు ఎసిపి నాగేంద్రరావు తెలిపారు. సమావేశంలో ఎఇ ఎస్ శ్రీనివాస్ రెడ్డి, తొర్రూరు ఎక్సైజ్ సిఐ భాస్కరరావు, ఎక్సైజ్ ఎస్ఐ రవళి, జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ హరీష్, తొర్రూరు ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక కష్టంపై దళారీ కన్ను..!

- పైసలిస్తేనే ఫైళ్లు ముందుకు..
- లేబర్ ఆఫీసుల్లో తీరని జాప్యం
- యాక్సిడెంట్ కేసుకు రూ.రెండు లక్షల వసూళ్లు?
- ఖమ్మంలో 4 వేల పైగా ఫైళ్లు పెండింగ్?
- కార్మిక సంక్షేమ బోర్డు రద్దు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికుల కష్టంపై 'దళారీ' కన్నుపడింది. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ పరిధిలో శ్రమజీవులకు వివిధ వెసులుబాట్లు లభిస్తున్నాయి. సహజ మరణం, ప్రమాద మరణం, చనిపోతే దహన ఖర్చులు, ప్రసూతి సహాయం, కూతురికి వివాహ కానుక, వికలాంగుల ఉపశమనం, ఆస్పత్రి ఖర్చులు.. ఇలా రకరకాల సౌకర్యాలను కార్మికులు పొందుతున్నారు. వీటిలో ఏది కావాలన్నా దళారీని ఆశ్రయిస్తేనే పనయ్యే పరిస్థితి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 2014 సెప్టెంబర్‌లో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటైంది. తెలంగాణ బిల్డింగ్, ఇతర నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటైన ఈ బోర్డులో కార్మిక సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు ఉండేవారు. ఈ బోర్డు నాడు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా 8.85 లక్షల కార్మికులను లబ్ధిదారులుగా నమోదు చేసింది. 2018లో కార్మిక సంఘాల ప్రతినిధులను ఈ బోర్డు నుంచి నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొలగించింది. అంతే నాటి నుంచి అధికారులు, దళారీలతో కలిసి ఆడిందే ఆట.. అన్నట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దళారీలు తెచ్చిన ఫైళ్లకు వెంటనే మోక్షం లభిస్తున్నా.. నేరుగా వచ్చిన ఫైళ్లను ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారని బాధితులు అంటున్నారు. మూడు, నాలుగేళ్ల క్రితం నాటి క్లైయిమ్‌లూ ఇంకా క్లియర్ కానివి ఉన్నాయంటే అతిశయోక్తి కాదు.

ఏళ్ల తరబడి పెండింగ్..

జిల్లాల్లోని సహాయ కార్మిక కమిషనర్ కార్యాలయాల్లో ఏళ్ల తరబడి ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. క్లియరయిన ఫైళ్ల వివరాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపుతున్న అధికారులు పెండింగ్ ఫైళ్ల విషయాన్ని మాత్రం గోప్యంగా ఉంచుతున్నారు. ఏ కారణంతో ఫైళ్లు పెండింగ్‌లో ఉంచారో.. రి మార్క్స్ చూపించకుండా రోజుల తరబడి కార్మికశాఖ కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారు. అదే దళారీలను వెంట తీసుకెళ్తే మాత్రం వెంటనే ఫైళ్లు క్లియర్ అవుతుండటం గమనార్హం. కార్మిక సంఘాల అంచనా ప్రకారం ఖమ్మం జిల్లాలో ఖమ్మం-1, 2, మధిర, సత్తుపల్లి సర్కిళ్లలో సుమారు 4వేలకుపైగా ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఖమ్మంలో అత్యధికంగా 2500, మధిరలో 1500 వరకు వివిధ కేటగిరీల ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయని కార్మిక ప్రతినిధులు అంటున్నారు.

ముట్టజెబితేనే ముందుకు..

ఖమ్మం జిల్లాలో గతేడాది మొత్తమ్మీద 5,109 ఫైళ్లు క్లియరయ్యాయి. వీటిలో వివాహ కానుకల క్లైయిమ్‌లు 1158, ప్రసూతి ప్రయోజనాలు 3058, సాధారణ మరణాల ఉపశమనం 817, ప్రమాద మరణాలు 61, శాశ్వత వైకల్యం 8, డిస్ట్రెస్ రిలీఫ్ 7 ఫైళ్ల చొప్పున క్లియర్ అయ్యాయి. వీటిలో అధికం దళారీల ప్రమేయంతోనే ముందుకు కదిలినట్టు ఆరోపణలున్నాయి. దళారీలు నేరుగా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ (ఎఎల్‌ఒ)లకే ముడుపులు ముట్టజెప్పి పనులు చేయిస్తున్నారని కార్మిక ప్రతినిధులు అంటున్నారు. ప్రమాద మరణాలకు రూ.6.30 లక్షల ఆర్థిక సహాయం లభిస్తుండగా దీనిలో సుమారు రూ.రెండు లక్షలు, సాధారణ మరణానికి లభించే రూ.1.30 లక్షల్లో రూ.30 వేలు, ప్రసూతి, వివాహ కానుకల కింద లభించే బెనిఫిట్స్‌లో రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. గతంలో ఖమ్మం జిల్లా కార్మిక విభాగంలో పనిచేసిన జూనియర్ అసిస్టెంట్ (ప్రస్తుతం ఎఎల్‌ఒ) లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడిన దాఖలాలూ ఉన్నాయి. వరంగల్ జిల్లా సహాయ కార్మిక కమిషనర్ రమేష్‌బాబు ఖమ్మం జిల్లాకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

ఆయన నెలలో రెండు, మూడు సార్లు మాత్రమే జిల్లాకు వస్తుండటంతో ఇక్కడ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. డిసిఎల్ వచ్చినప్పుడు పెండింగ్ ఫైళ్లపై కార్మిక ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. వారంలో క్లియర్ చేస్తామని ఆయన చెబుతున్నారే తప్ప పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు ఉండటం లేదని కార్మిక సంఘాల ఆరోపణ. 2020-21 నాటి ఫైళ్లనూ ఎలాంటి రిమార్క్స్ చెప్పకుండా పెండింగ్‌లో ఉంచారని అంటున్నారు.



పైసలు ఇవ్వకపోతే కొర్రీలు.. - ముదాం శ్రీనివాస్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, ఖమ్మం జిల్లా కార్యదర్శి

కార్మిక శాఖ కార్యాలయంలో పైసలు ఇవ్వకపోతే ఫైల్ కదిలేలా లేదు. రకరకాల కొర్రీలు పెట్టి బాధితులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నిర్మాణ రంగ కార్మికులు సిమెంట్, మట్టి పనులు చేస్తుండటంతో బొటన వేలు రేఖలు చెరుగుతున్నాయి. ప్రత్యామ్నాయంగా ఐరీష్ కెమెరా ఏర్పాటు చేయాలి. కార్మిక సంక్షేమ బోర్డులో కార్మిక ప్రతినిధులకు చోటు కల్పించాలి. కార్మిక శాఖలో అవినీతికి చేతులు చాస్తున్న అధికారులపై చర్యలు తీసుకుంటేనే బాధితులకు న్యాయం జరుగుతుంది. పెండింగ్ ఫైళ్ల వివరాలను బయటకు వెల్లడించి, వాటిని వెంటనే క్లియర్ చేయాలి. చిన్నచిన్న రిమార్క్స్ ఉంటే వాటిని సరిచేసుకునే వెసులుబాటు కల్పించి, కార్మికులు, కుటుంబాలకు రావాల్సిన బెనిఫిట్స్‌లో కమీషన్ల పేరుతో ఎలాంటి కోతలు పెట్టకుండా చూడాలి.

నిరాశపర్చిన టెక్ మహీంద్రా

ముంబయి : ప్రముఖ ఐటి కంపెనీ టెక్ మహీంద్రా లాభాలు భారీగా తగ్గాయి. 2023-24 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం(క్యూ)లో 60 శాతం పతనంతో రూ.510 కోట్ల లాభాలతో సరిపెట్టుకుంది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1,296 కోట్ల లాభాలు సాధించింది. ఇదే సమయంలో రూ.13,734 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. క్రితం క్యూ3లో 4.6 శాతం తగ్గి రూ.13,101 కోట్లుగా చోటు చేసుకుంది. బిఎస్‌ఇలో టెక్ మహీంద్రా షేర్ 3.09 శాతం తగ్గి రూ.1,407.75 వద్ద ముగిసింది.

కెనరా బ్యాంక్ లాభాల్లో 27% వృద్ధి

ముంబయి : ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ 2023 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 26.86 శాతం వృద్ధితో రూ.3,656 కోట్ల నికర లాభాలు సాధించింది. ముఖ్యంగా రుణాల జారీలో పెరుగుదల ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలకు దోహదం చేసింది. గడిచిన త్రైమాసికంలో కంపెనీ నికర వడ్డీ ఆదాయం 9.5 శాతం పెరిగి రూ.9,417 కోట్లకు చేరింది. అదే సమయంలో ఇతర ఆదాయాలు 7.75 శాతం వృద్ధితో రూ.4,295 కోట్లుగా నమోదయ్యింది. దేశీయ డిపాజిట్లు 8.07 శాతం పెరిగి రూ.11.67 లక్షల కోట్లకు చేరగా.. రుణాల జారీ 12.56 శాతం వృద్ధితో రూ.9 లక్షల కోట్లుగా నమోదయ్యింది. 2023 డిసెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 4.39 శాతానికి తగ్గాయి. ఇవి 2022 డిసెంబర్ నాటికి 5 శాతంగా ఉన్నాయి. నికర నిర్థక ఆస్తులు 1.96 శాతం నుంచి 1.32 శాతానికి తగ్గాయి.

బజాజ్ ఆటో రెవెన్యూ రూ.12,114 కోట్లు

ముంబయి : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ బజాజ్ ఆటో 2023-24 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 30 శాతం వృద్ధితో రూ.12,114 కోట్ల రెవెన్యూ నమోదు చేసింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.9,315 కోట్ల రెవెన్యూ ప్రకటించింది. ఇదే సమయంలో 1,491 కోట్లుగా ఉన్న నికర లాభాలు.. గడిచిన క్యూ3లో 37 శాతం వృద్ధితో రూ.2,042 కోట్ల లాభాలు సాధించింది. పండగ సీజన్ అమ్మకాలకు తోడు ఎగుమతుల్లోనూ రాణించడంతో మెరుగైన ఫలితాలు సాధించినట్లు ఆ కంపెనీ తెలిపింది.